# ప్రవాసి

## తూరుపు కొండలు నునుపు అనే సామెతను రెండు విధాలుగా నిరూపించిన మిత్రద్వయం

రాత్రి ఏడవుతోంది. రాజమండ్రి శేషయ్య మెట్టమీద - గోదావరి ఒడ్డున నిల్చుని వెన్నెల గోదావరి అలలు కలగలిసిపోయిన విచిత్రమైన కాంతి కిరణాలు కిరణాలుగా ప్రసరిస్తున్న దృశ్యాన్ని - మంచుముక్కల మీద ముత్యాలు కడుతున్న విదేశీ మద్యంతో చప్పరిస్తూ ఆస్వాదిస్తున్నాడు తారకం.

"సార్! ఫాక్స్" అంటున్న పనివాడి గొంతు, తారకం ఆనందానుభూతికి రవంత విఘాతం కలిగించింది. ఫాక్స్ మెసేజ్ తెచ్చిన జాన్, తళతళలాడుతున్న పోర్సిలిన్ ప్లేట్‌లో దాన్నుంచి, టీపాయ్ మీద పెట్టి, వినయసూచకంగా నిటారుగా నిలబడి, మరబొమ్మలా సెల్యూట్ కొట్టి నిష్క్రమించాడు. సేవిస్తున్న విదేశీ మద్యాన్ని ఆస్వాదిస్తున్న గోదావరి వెన్నెలని అవతలకు నెట్టి, సోఫాలో జేరగిలబడి జాన్ తెచ్చిన ఫాక్స్ మెసేజ్ విప్పాడు తారకం.

"ఏరిండియా ఫ్లయిట్ 2709లో, మూడో తారీకు నాటికి, జానకితో సహా ఇండియాకి చేరుకుంటున్నాను. సహార్ ఏర్‌పోర్ట్‌కొచ్చి కల్సుకో. వివరాలూ, నీ ఏర్ టికెట్టూ కొరియర్‌లో వస్తాయి. రామరాజు." రామరాజు పేరులోని అక్షరాలు కంటపడగానే తారకం ఎనిమిదేళ్ళు వెనక్కి వెళ్ళిపోయాడు.

చదువుసాములు పూర్తిచేసుకొని - సంపాదించుకొన్న సంస్కృతీ సంపదను చెరో మూటా నెత్తి కెత్తుకుని, రామరాజూ తనూ ఎనిమిదేళ్ళకు పూర్వం కాకినాడలో విడిపోయారు. రామరాజు స్టేట్స్‌కి వెళ్ళిపోయాడు. తారకం గోదావరొడ్డున సకల సౌకర్యాలూ అమర్చుకొని తాజ్ మహల్లాంటి పాలరాతి గుమ్మటం మొలిపించుకొని, సీమ దొరల సేవల్లో, విదేశీ మర్యాదల్ని జీర్ణించుకొన్న పనివాళ్ళని అడుగడుగునా అన్ని పనులకూ ఏర్పాటు చేసుకొని తాను నిర్మించుకొన్న స్వర్గధామంలో తానే ఒక అతిథిలా ఆనందవార్ధిలో ఏకాకిలా ఓలలాడుతున్నాడు. రామరాజు చదివింది డాక్టరే అయినా; అంగ, వంగ, కళింగ, కాశ్మీర సంస్కృతీ సంప్రదాయాలనీ; ఆంగ్ల, పారశీక, తురుష్క మర్యాదలనీ, రీతి నీతుల్నీ ఆపోశనపట్టి, ఆర్ష భారతీయుడుగా తనదైన ఒక విశిష్ట వ్యక్తిత్వాన్ని మలుచుకొన్నవాడు.

తారకం బి.ఇ పట్టా పుచ్చుకున్నవాడని ఒక్క ముక్కలో చెబితే చాలా కొంచెం చెప్పినట్టవుతుంది. చదివింది బి.ఇనే కావచ్చుగాని; దేశదేశాల మానవ నాగరికతా పరిణామాల్ని ఆమూలాగ్రం అవలోడనం చేసి; ఆయా దేశాల కళాకాంతులతో తనదైన విలక్షణ వ్యక్తిత్వానికి నగిషీలు చెక్కుకొని, ఈ భారతదేశ సర్వజనాల్లో తానొక్కడే స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తిననీ - ఎవర్నీ అంటక, ముట్టక ఉన్నాడు; తులలేని సంపదతో ఏకాకి అయినవాడు.

వీళ్ళిద్దరి ఆలోచనల్లో, ఆచార సంస్కృతుల్లో ఏర్పడ్డ విభేదమే వీళ్ళిద్దర్నీ దగ్గరచేసి, ఒకళ్ళంటే ఒకళ్ళకు గౌరవాన్నీ, స్నేహాన్నీ పెంచి ప్రోది చేసింది వీళ్ళు కలకత్తాలో చదువుకునే రోజుల్లో.

ఈ భిన్నధ్రువాలు ఒక్కటి కావడానికి బలమైన సామాన్యాభిప్రాయం కూడా ఒకటి లేకపోలేదు. అది "స్త్రీ." భార్య అనే పదార్థం మగవాడి స్వేచ్ఛకూ, ఎదుగుదలకూ అడ్డం వచ్చే ఎదిగిపోయిన ఎత్తయిన పర్వతమనే అభిప్రాయం. ఆ ఒక్కటే వీళ్ళిద్దర్నీ దగ్గర చేసిందనాలి. కాకపోతే! కలకత్తా విడిచిపెట్టి, కాకినాడలో ఇద్దరు 'కాదు మనం ఒక్కరిమేనని హాయిగా తిరిగి విడిపోయే రోజున ఆ పరస్పర భిన్న ధ్రువాలిద్దరూ తలలు జోడించుకొని, చేతిలో చెయ్యి కలుపుకుని "మనం జీవితంలో ఎన్నడూ పెళ్ళి చేసుకోకూడ"దనే నిర్ణయంతో విడిపోతారు!

ముసురుకొంటున్న అన్ని జ్ఞాపకాల్లో నుంచి కూడా రామరాజు బొమ్మ చెరిగిపోటం లేదు తారకానికి. విడిపోయిన కొత్తలో ఇద్దరూ రోజూ చెరో మూడు సార్లయినా ఫోన్లలో హలో హలోమని పలకరించుకొనే వాళ్ళు... పరిహాసాలాడుకొనే వాళ్ళు. అలాంటిది ఏడాది గడిచేక ఇద్దరి ఫోన్లూ పలకడం మానేసి, మౌనవ్రతం పాటించాయి. ఎందుకో ఏమయిందో ఇద్దరికీ తెలీదు. అంతే - ఆ మౌనం క్రమంగా వాళ్ళని దూరం చేసి అప్పుడూ అప్పుడూ ఆలోచనల్లో మెదిలే వాళ్ళని కూడా మరిపించేసింది. కూతా మొర్రా లేకుండా ఇప్పుడీ ఫాక్స్ వచ్చి కలచింది. రామరాజుని గురించిన ఆలోచనకంటే జానకిని గురించిన ఆలోచనే తారకాన్ని కలచిపెడుతోంది. ఎవరీ జానకి:

ఫ్రెండా? స్టూడెంటా?

భార్యా ఇష్ట సఖా? ఎవరన్న ఆలోచనల్లోంచి తెమిలి ఇవతల పడలేకపోతున్నవాణ్ణి కొరియర్‌లో వచ్చిన రామరాజు ఉత్తరాన్ని తెచ్చి అందించిన విలియం బయట పడేసి చక్కాపోయాడు. ఉత్తరం విప్పేడు తారకం.

ఉత్తరంతో పాటు కొంత డబ్బూ, విశాఖపట్నం నుంచి బాంబేకి తన కోసం ఒక ఎయిర్ టికెట్ కూడా ఉన్నాయ్యి. ఉత్తరం చాలా క్లుప్తంగా రాశాడు. "మేమిద్దరం బొంబాయి వస్తున్నాం. నువు కూడా రావాలి మూడో తారీకుకల్లా. వస్తావు కనుక వివరాలన్నీ సముఖంలో ముచ్చట్లు - నీ రామరాజు." అంతే!


మూడు ముక్కల్లో ముగించి తారకం బుర్ర తినేశాడు రామరాజు, ఆమె ఎవరన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిల్చి - ఆలోచనలకూ సమాధానాలకూ వ్యవధి లేకుండా. అంతలోనే వాళ్ళకి వసతి సంగతి గుర్తుకొచ్చి, బొంబాయి ఫోన్ చేసి తాజ్ ఇంటర్నేషనల్‌లో రెండు సూట్స్ రిజర్వ్ చేశాడు. సింగిల్ సూట్ తనకీ; రామరాజుకి డబల్ సూటూను. గ్లాసులో మిగిలిన విస్కీ అలా ఒదిలేసి "టైం లేదే!" అని మనసులో మాట పైకి అనేస్తూ హడావిడిగా డ్రెస్ చేసుకుని ఒక బ్రీఫ్‌కేసుతో ఎయిర్ కండిషన్డ్ మెర్సిడెజ్ బెంజ్‌లో బయలుదేరాడు తారకం.

విశాఖపట్నంలో ఎయిర్ పోర్ట్‌లో తన కారు పార్క్ చేసుకుని బాంబే వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న విమానంలో కూర్చున్నాడు - "వాట్ ఎ టిపికల్ ఫెలో హి ఈజ్" అనుకుంటూ తారకం.

* * *

శాంతాక్రుజ్ ఏర్‌పోర్టులో దిగేసరికి, మధ్యాహ్నం పావు తక్కువ ఒంటిగంట. వెంటనే టాక్సీ చేసుకుని "టైం లేదే!" అనుకుంటూ సహార్ ఎయిర్‌పోర్టు చేరుకున్నాడు తారకం. ఇంకా ఫ్లయిట్ దిగలేదు. పావుగంటలో దిగుతుందని ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో తెలుసుకుని పదిహేను నిమిషాల్నీ తారకం చాలా అసహనంగా, ఉత్కంఠతో గడపాల్సి వచ్చింది. ఆ స్థితిలోనూ జానకి మాత్రం అతని బుర్ర తినేస్తూనే ఉంది.

"భార్య మాత్రం అయి ఉండదు -"



చిత్రాలు: సర్వం

"ఎవరో తెలిసినవాళ్ళు తాలూకు అయి ఉంటుంది. బొంబాయివరకూ దిగబెట్టవలసింది కావచ్చు."

ఒక రకంగా ఆలోచనా పీడను సమాధానపరుచుకో ప్రయత్నించాడు తారకం.


రామరాజు సామాన్యుడు కాడు. ఎంతో ఎత్తులకు ఎదిగిపోయిన ఉన్నత శిఖరం లాంటివాడు. తారకం మనసులో రామరాజుకి ఎంతో ఉన్నత స్థానం ఇచ్చాడు. అతని విజ్ఞానం; ఆ ఆశయాలు కొలవటానికి ఏ కొలబద్దా చాలదు. అలాంటి రామరాజా ఇప్పుడు మాట తప్పి పెళ్ళి చేసుకోవడం!

ఏమో! ఆమె అతన్ని ఎంతలా బుట్టలో పెట్టిందో! "ఔను", "కాదు" అనే ఆలోచనల వరవడిలో ఉక్కిరిబిక్కిరైపోతున్నాడు తారకం.

రామరాజుని గురించి ఇంకేమేమి ఊహల్లో తగులుకునేవాడో తారకం; ఫ్లయిట్ దిగుతున్న సమాచారం స్పీకర్‌లో పెద్దగా వినిపించకపోతే -

తారకం ఆ గాజు తలుపులకు ఇటు పక్క దగ్గరగా నిల్చుని విమానంలోంచి దిగి వస్తున్న వాళ్ళలో రామరాజునీ, జానకినీ పోల్చుకొనే పనిలో నిమగ్నమైపోయాడు. చిన్నప్పటి స్నేహితుడు రామరాజుని పోల్చుకోవడం ఏమంత కష్టం కాదు.

ఆరడుగుల మనిషి. విశాలమైన ముఖంలో చారెడేసి కళ్ళు. మెరిసిపోయే పసిమి ఛాయ. వీటికి తోడు పాము కుబుసం లాంటి తెల్లటి ధోవతి; ధోవతి తెలుపుతో ఎకసెక్కెమాడే మరీ తెల్లని లాల్చీ. పైన కండువా. ఏ మార్పూ కనిపించని రామరాజుని చూసేసరికి తారకం ముఖంలో నవ్వు చింది కుడి చేయి లేచి గాలిలో ఊగింది. గ్లాస్ పేనల్‌కి అవతల పక్క ఉన్న జనాన్ని పారజూసిన రామరాజుకి తారకాన్ని గుర్తుపట్టడం ఏమాత్రం కష్టం కాలేదు. వాళ్ళిద్దరూ విడిపోయేనాడు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలానే ఉన్నాడు. కాకపోతే కొత్తగా నోట్లో ఒక పైప్. రామరాజు రెండు చేతులూ ఎత్తి, ఆనందపతాకం ఎగురుతున్నంత హాయిగా, వెనక్కి తిరిగి ఓ అమ్మాయితో ఏదో చెప్పి మురిసిపోతున్నాడు.



రామరాజూ, తారకం గ్లాస్ పేనల్‌కి ఆవైపు నుంచీ ఈ వైపు నుంచీ ముద్దులు పెట్టేసుకొంటున్నారు. వాళ్ళిద్దరి ఆనంద చుంబన క్రీడకీ పొంగిపోతూ ఆమె కూడా తన అరచేతిని గ్లాసు మీద ఆనించింది. కన్వేయర్ బెల్ట్ మీద వచ్చిన రెండు సూట్‌కేసులూ అందుకుని కస్టమ్స్ వారి చేత మర్యాదపూర్వకమైన చిన్న నవ్వుతోనే "ఔ" ననిపించుకుని రామరాజూ, జానకీ లాంజ్‌లోకి వచ్చారు. చేతిలో ఉన్న సూట్‌కేసు కిందపెట్టి రామరాజు అమాంతం రెండు చేతులూ చాపి తారకాన్ని పొదివి కౌగిలించుకున్నాడు. వాళ్ళిద్దరి కళ్ళూ ఆ క్షణాన మంచులో తడిసిన నందివర్ధనాలయ్యాయి.

రామరాజు ఆనందపుటావేగాన్ని ఎగబీల్చుకుంటూ "ఈవిడే జానకి! నా భార్య" అనేసరికి తారకం తెల్లబోయి చేష్టలు దక్కి నిల్చుండిపోయాడు.

"ఔనండీ! ఆరేళ్ళుగా మీ గురించే చెప్పీ చెప్పీ అలిసిపోయారు పాపం! మీ స్నేహం ఎంత గొప్పదో నాకు ముందే తెలుసు" అన్న జానకి తెలుగుకి తేరుకుని - తన్ను తాను సంబాళించుకొంటూ "రండి, తాజ్‌లో మన కోసం రెండు సూట్స్ రిజర్వ్ చేసుంచాను" అన్నాడు తారకం.

"ఎందుకురా అలా చేసేవు. నేను ఓబెరాయ్‌లో బుక్ చేసే బయలుదేరానుగా. పోనీ! నీ విడిదే భాయం! పోదాం పదండి" అంటూ రామరాజు సూట్‌కేస్‌లతో జానకి వెంట నడవగా తారకం టాక్సీ దగ్గరకి దారి తీశాడు.

* * *

తారకం ఉన్న సూట్ తలుపు టక్‌టక్ మనేసరికి వచ్చినవారికి స్వాగతం చెబుతున్న గొంతుతో "వెల్‌కమ్" అన్నాడు. ముందు జానకి - వెనుక రామరాజు.

"అరే! అనుష్ఠానాలన్నీ అప్పుడే పూర్తిచేసుకొన్నారే!" అంది జానకి తారకాన్ని పలకరిస్తూ.

"నే చెప్పలేదా! మా వాడిదంతా అమిత తొందరా మహా వేగమూనని -" అన్నాడు రామరాజు.

"ఔను! మీరు చెప్పినట్టే ఉంది" అందామె చిరునవ్వుతో.

"తరువాత కార్యక్రమం?" అంటూ రామరాజు వంక చూసి.

"తారకం, మనకెక్కువ వ్యవధి లేదు. ముందు ఉత్తర భారతదేశంలో తీర్థక్షేత్రాలన్నీ దర్శించాలి" అన్నాడు రామరాజు. జవాబుగా ఏదో అనబోయిన తారకాన్ని వారిస్తూ "ఆ కోరిక నాది కాదు - జానకిది" అంటూ రామరాజు జానకి ముఖంలోకి చూశాడు.

"ఔనండీ! అయోధ్యా, మధురా, మాయా, అవంతీ, గయా, కాశీ, ప్రయాగా క్షేత్రాలన్నీ సందర్శించాలి" అన్నదామె, అవన్నీ తిరిగేక కలిగినంత ఉద్వేగంతో.

"తరువాత సింహాచలం, శ్రీకూర్మం, అన్నవరం...."

"త్వరగా బయల్దేరాలి మరి" అన్న జానకి మాటకి వెంటనే స్పందిస్తూ "నేనెవరో తెలుసుగా, ఎవ్వర్ రెడీ తారకాన్ని" అన్నాడు తారకం.

"శుభస్య శీఘ్రం. బయలుదేరుదాం" అన్నది జానకి.

"ఓ పని చేస్తే - తారకం! నీ కారు విశాఖ ఏరోడ్రోంలో పార్క్ చేశానన్నావు గదా. మనమిక్కడే ఓ టాక్సీ మాట్లాడుకొని, తీర్థాలు, క్షేత్రాలు చూసుకుని తరవాత విశాఖపట్నం చేరుకొందాం. ఏమంటావ్" అన్నాడు రామరాజు.

"ఇంచక్క" అన్నాడు తారకం.

"అయితే, ఆలస్యం దేనికి? త్వరగా హొటల్ ఖాళీ చేస్తే టాక్సీ ఎక్కుదాం" అన్నది జానకి ఎప్పుడెప్పుడు చూస్తామా తీర్థాలన్నీ అన్నంత తొందరగా.

క్షణాల మీద తాజ్ ఇంటర్‌నేషనల్ ఖాళీ చేశారు.

* * *

"ముందస్తుగా మనం ఈ కారులోనే ద్వారక్కి పోదాం" అన్నది జానకి టాక్సీలో సర్దుక్కూర్చుంటూ.

"అలాగే! కానీ. మనకు ఉన్న వ్యవధి తక్కువ. చూడాల్సిన తీర్థక్షేత్రాలు ఎక్కువ కనుక వీలైనంతవరకూ విమానంలోనే తిరుగుదాం. ఏమంటావ్ తారకం?" అన్నాడు రామరాజు.

"ఎక్కడి కెళ్ళాలి; ఎలా వెళ్ళాలి అనేదంతా ఆవిడిష్టమే; మనం నిమిత్త మాత్రులంగా ఉండిపోదాం; ఏమంటావ్?" అన్నాడు తారకం ముందు సీట్లో నుంచి రామరాజు వంక చూస్తూ. కారు ప్రయాణం వేగం పుంజుకొంది.

"కళాపూర్ణోదయంలో పింగళి సూరనగారు మణికంధరుణ్ణి తిప్పాడు చూడండి. అలా మనం కూడా తీర్థయాత్ర చేయాలి. మధుర సేవించి, హరిద్వారం దర్శించి; సాలగ్రామం, బదరికాశ్రమం, నైమిశారణ్యం. కురుక్షేత్రం, ప్రయాగ. కాశీ, అయోధ్య అటునుంచి పూరీ జగన్నాథం, సింహాచలం, అహోబిలం, తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనాలు చేసుకుని; కంచి కామాక్షికి, ఏకామ్రనాథునికి, శ్రీరంగనాథునికి సాష్టాంగ నమస్కారాలు చేసుకోవాలి!" అన్నది జానకి.

ఆమె మాటలకీ, ముఖ్యంగా ఆ తెలుగు పలుకుబడికీ ఆశ్చర్యపోతూ తారకం, రామరాజు వంక చూశాడు. తారకం మనసులో మాట గ్రహించినవాడిలా రామరాజు "జానకి అచ్చం తెలుగింటి ఆడబడుచా. లేకపోతే అమెరికాలో స్థిరపడ్డ కుటుంబానికి చెందిందా అని అనుమానంగా ఉంది కదూ తారకం!" అన్నాడు.

"అసలు నేను అమెరికా అమ్మాయినేనండి. కానీ, తెలుగు నేలకు కాపరాని

**రామరాజుని గురించి ఆలోచనకంటే జానకిని గురించి ఆలోచనే తారకాన్ని కలచిపెడుతోంది. ఎవరీ జానకీ: ఫ్రెండా? స్టూడెంటా? భార్యా, ఇష్టసఖా?**

కొచ్చాను" అన్న జానకి మాటలకు అదెలా సాధ్యం అన్నట్టు చూశాడు తారకం.

"ఏం! ఎలాగని ఆశ్చర్యంగా ఉందా మీకు? మీరు చెప్పండి మరిదిగారికి" అంటూ జానకి రామరాజుని మోచేత్తో మెల్లగా పొడిచింది.

ఏమిటిది? ముక్కూమొహం ఇప్పటిదాకా తెలియని నాతో ఇంత చప్పున బంధుత్వం కలిపేసుకొంటున్నదీమె అనిపించింది తారకానికి.

రామరాజు నన్ను తమ్ముడి కంటే గొప్పచేసి ఆవిడతో చెప్పి ఉంటాడు అని వెంటనే సమాధానపరుచుకొన్నాడు. తారకం వంక చూస్తూ "నువ్వే చెప్పు - నువ్వు చెబితేనే అందంగా ఉంటుంది" అన్నాడు జానకి నుద్దేశిస్తూ రామరాజు.

"మా తాతగారూ, ముత్తాతగారూ కూడా అమెరికా వాళ్ళేనండి. తెలుగంటే మా ఇంటా వంటా ఒక్కళ్ళకీ తెలీదు. నా కంతకంటే తెలీదు." జానకి నవ్వుతూ మాట్లాడేస్తోంది.

"చిన్నప్పటినుంచీ నాకు భలే కలలొచ్చేవండి. ఆ కలల్లో కనిపించే దృశ్యాలు, వినిపించే భాష, పరిచయమవుతున్న మనుషులు. ఎక్కడో తెలియదు, ఏమిటో తెలీదు, ఎవరో అంతకంటే తెలీదు -

చెబితే నమ్మరు గాని చాలా ఆశ్చర్యంగా ఉండేదండి. ఎత్తయిన పర్వతాలు - ఆ పర్వతాల మీద ఒత్తయిన చెట్లు - ఆ చెట్ల మీద రంగురంగుల పిట్టలు, తియతీయని కూతలు - ఆ గట్లని ఒరిసి ప్రవహించే ఏటి గలగలలు -

ఆ మనుషులు! బారెడేసి గడ్డాలతో, విబూది పూసుకొని కొండ గుహల్లో ఏదో ధ్యానం చేసుకొనేవారు. వాళ్ళట్లా తపస్సు చేసుకుంటుంటే వాళ్ళకెదురుగా పులులూ, సింహాలూ, లేళ్ళు కుందేళ్ళూ హాయిహాయిగా కలసి ఆడుకొనేవి -

ఇదంతా ఎవరికి చెప్పినా నమ్మేవాళ్ళు కాదు - పైగా "పిచ్చి" అని నవ్వేసేవాళ్ళు - ఇలాంటి కలలు ఏవేవో పిచ్చిపిచ్చిగా అస్తమానూ వచ్చేవి; నాకూ చెప్పి చెప్పి వినుగెత్తి ఎవళ్ళకీ చెప్పటం మానేశాను -

ఒకసారండీ! అట్లాంటాలో ఏదో సభ జరుగుతుంటే మా ఇంట్లో వాళ్ళతో కలసి నేనూ వెళ్ళానండీ - మీరు నమ్మరుగానండీ! తీరా అక్కడికి వెళ్ళేసరికి సరిగ్గా నా కలల్లో కనిపించే మనుషుల్లాంటి వాళ్ళనే అక్కడ చూశాను. పట్టు వస్త్రాలు; రుద్రాక్ష తావళాలూ; కావిగుడ్డలూ విభూతి పూతలూ - పెద్ద పెద్ద గడ్డాలు; వాళ్ళందర్నీ నా కలల్లో ఇదివరకే చూసేదాన్ని - అక్కడ వాళ్ళు మాట్లాడుతున్న భాషే నా కలల్లోని భాష -

ఎంత మధురంగా ఉందనుకున్నారూ!

మా పెద్దవాళ్ళని అడిగాను. వీళ్ళంతా ఎవరూ, ఏఁవిటి మాట్లాడుతున్నారూ? అని-

భారతదేశం నుంచి వచ్చారనీ, వాళ్ళు మాట్లాడుతున్నది సంస్కృతమూ తెలుగూ అనీ. భారతీయ నాగరికతా సంస్కృతీ సంప్రదాయాలను గురించి ఉపన్యాసాలు చేస్తున్నారనీ తెలిసింది. అంతే. అప్పట్నుంచీ తెలుగూ సంస్కృతం నేర్చుకోవాలన్న రంధి."

"రకరకాల పుస్తకాలు తెప్పించుకొని, అక్కడ తెలుగుదేశం నుంచి వచ్చిన మహానుభావుల దగ్గరకుపోయి చదువుకొన్నాను."

"ఆ చదువుకోటం నాకేం కష్టమనిపించలేదు. ఏవో పాత పాఠాలే పునశ్చరణ చేసుకొన్నట్టనిపించేది. ఆశ్చర్యపోకండి! మా అమ్మా నాన్నలకి కూడా మొదట్లో ఏం తెలియక, ఎటూ తెమలక 'సరే కానీ చూద్దాం ఏం జరుగుతుందో'నని నేను ఆడింది ఆటగా సాగనిచ్చారు...."

ప్రవాహవేగంతో సాగుతున్న కథన కుతూహలానికి కొట్టుకుపోకుండా తెలుగు తెలిసీ కూడా ఒళ్ళు దగ్గరుంచుకుని కారు నడుపుతున్న డ్రైవర్ "ద్వారక వచ్చేసింది సార్! ఎక్కడికి పోవాలో చెబితే అన్న అర్థోక్తితో అడ్డపడ్డాడు. లేకపోతే జానకి ఇంకా ఎంతసేపు చెప్పేదో, ఏవేఁవి చెప్పేదో!

"పదవోయ్! సరాసరి శ్రీకృష్ణ మందిరానికి" అంటున్న రామరాజు మాట కత్తిరించి, "ముందు గోమతీ సాగర సంగమంలో స్నానాలు చేసుకుని దైవ దర్శనం చేసుకుందాం" అన్నది జానకి.

"రా తారకం నువు కూడా సరదాగా" అన్నాడు రామరాజు కారు దిగుతూ

"లేదులే. నేనిల్లా కార్లోనే కూర్చుంటాను. మీరుభయులూ వెళ్ళి ఆ ఫార్మాలిటీస్ పూర్తిచేసుకురండి."

"పోనీ మీరూ రాకూడదా మరిదిగారూ!" అన్నది జానకి.

"నన్నిలా ఒదిలేయండి, ప్లీజ్!" అన్నాడు తారకం నాజూకుగా కాదంటూ పైపు వెలిగించుకుంటూ.

* * *

ద్వారకా శ్రీకృష్ణ దేవుని నుతించి, బృందావన సంచారిని కీర్తించి, వ్రేపల్లెలో పాపడి క్రీడలతో క్రీడించి, నందవ్రజంతో గోప భామల కేళీ విలాసాలు తిలకించి పులకించి - కాశీ, ప్రయాగ, అయోధ్యలలో వరదేవతా దర్శనాలు పూర్తిచేసుకొని, పిండ ప్రదానానికి గయ చేరుకున్నారు.

రామరాజు మళ్ళీ తారకాన్ని బుజ్జగిస్తూ "దేవుళ్ళూ పితృదేవుళ్ళూ ఎలా ఉన్నా జీవ శ్రాద్ధమన్నా చేసుకుందాం రారా తారకం" అన్నాడు.

"ఇవన్నీ నాకు అర్థంకాని ఆచారాలు" అన్నట్లుగా తారకం పీలుస్తున్న పైపు దులుపుతూ చిలిపిగా నవ్వి ఊరుకున్నాడు.

జానకీ, రామరాజు పిండ ప్రదానాలు చేయడానికి మడి గట్టుకుని పురోహితుని వెంట వెళ్ళిపోయారు. తారకం ఒంటిగా కూర్చుని పైప్ పొగ లాగి లాగి విసిగిపోయి, కారు దిగి కాలక్షేపంగా విష్ణుపాదాల వైపుకు నడిచాడు.

జానకీ, రామరాజు శ్రద్ధాసక్తులతో సభక్తికంగా పిండాలు చేసి పెడుతుంటే తారకానికి ఏవేవో ఆలోచనలు మునురుకొస్తుంటే చూస్తూ నిలుచున్నాడు.

అతనిలో కదిలే ఆలోచనలకు సముద్రపుటలల్లా ఆదీ అంతూ తెలియకుండాపోయినై. తెలియకుండానే పుట్టే సంశయాల అలలు. ఒడ్డు చేరకుండానే విరిగి పోయే కెరటాలు.

తంతు ముగించుకొని వాళ్ళిద్దరూ లేచి వచ్చారు. "మనం త్వరగా తెమిలి దక్షిణదేశ యాత్ర కూడా ముగించుకొని విశాఖపట్టణం చేరుకోవాలి" అన్నాడు రామరాజు.

"ఎంత తొందరయినా కంచి కామాక్షికీ, మధుర మీనాక్షికీ కుంకుమ పూజలు చేయించుకోవాలి" అన్నది జానకి.

"అయితే, ముందు పాట్నా వెళ్ళి అక్కణ్ణించి మద్రాసు - ఏం?" అన్నాడు తారకం. ముగ్గురూ కార్లో ఎక్కారు. కారు పాట్నాకి పరుగు తీసింది.

* * *

విశాఖపట్నంలో విమానం దిగి తారకం కారు తీసుకొని సింహాచలం, శ్రీకూర్మం, అన్నవరం, ద్రాక్షారామ భీమేశ్వరుల దర్శనాలకు బయలుదేరారు.

"అమెరికాలో ఉంటున్నప్పుడు, తెలుగుభాషా సమితిలో విలియం అనే పెద్దమనిషి ఒకాయన ఉండేవారు" అన్నాడు రామరాజు.

"ఏఁవిటి, మన పెళ్ళి ముచ్చట్లు మొదలెట్టారా?" అంది జానకి.

"ఏమిటి; ఎంతసేపూ నువ్వు చెప్పడమేగానీ, నన్నేమీఁ చెప్పనివ్వవా?"

"ఇదేమన్నా సీతారామకల్యాణమా హరికథ చెప్పడానికి? మూడు ముక్కల్లో చెప్పాలంటే, ఆ విలియంగారు మా పెళ్ళి కుదిర్చారు. చికాగోలో వేంకటేశ్వరస్వామి గుళ్ళో పెద్దల సమక్షంలో జరిగింది మరిదిగారూ మా పెళ్ళి. చాలా ఆ వివరాలు, ఇంకా విపులంగా చెప్పాలా?" అంటూ జానకి రామరాజు వంక కొంటెగా చూసింది.

వస్తున్న నవ్వుని పెదవుల మీదే నొక్కేశాడు తారకం నవ్వకుండా.

ఏదీ మాట్లాడకుండా ఉండటం మర్యాద కాదని మొదలెట్టిన రామరాజు, జానకి మంగళహారతితో మరి మాట్లాడలేదు. చూడవలసిన వన్నీ చూసి, వేడవలసిందేదో వేడుకొని పొద్దుకుంకే సరికి రాజమండ్రి చేరుకున్నారు. తారకం కారు హారన్ చప్పుడికే మహల్ మహలంతా మేలుకొన్నట్లు ఎక్కడెక్కడి లైట్లూ ఒక్కసారి వెలిగినై. అడుగడుగునా పరిచారకులు అప్రమత్తులై తమ తమ విధుల్లో మునిగిపోయారు.

తాజమహల్ లాంటి ఆ రాజమహల్లోకి అడుగుపెడుతూనే జానకి చకిత అయిపోయి "అమెరికాలో మనం ఉండే ఇల్లు కూడా అచ్చం ఇల్లానే ఉండేది కాదండీ!" రామరాజుతో చెబుతూ - "మొత్తానికి మరిదిగారిది మంచి అభిరుచి" అని మెచ్చుకొంది.

"మరేమనుకున్నావ్ మా తారకం అంటే. భారతదేశంలో తప్ప బుట్టాడుగానీ, అన్నీ విదేశీ మర్యాదలూ, ఆచారాలు, అభిరుచులే" తారకాన్ని మెచ్చుకుంటూ రామరాజు ఓ కితాబు వేశాడు. బేరర్ ప్లేట్‌లో పెట్టి తెచ్చిన మంచినీళ్ళ గ్లాసులు ఒక్కొక్కరికే అందించి, మళ్ళీ ఆ ఖాళీ గ్లాసుల్ని ప్లేట్‌లోకి అందుకుని అమర్చుకొంటుంటే, జానకి అక్కడ ఉన్న ప్రతి వస్తువు అమరికనూ నిశితంగా ఔత్సుక్యంతో పరిశీలిస్తూ, అలాగే స్నానాల గదికి దారి తీసింది.

"ఏవిఁటో తారకం! మా పెళ్ళి కాకతాళీయంగా అయిందో, లేకపోతే విధివశాత్తూ అయిందో ఇప్పటికీ చెప్పలేకుండా ఉన్నాను. రెండుచేతులా డబ్బు గడించి భారతదేశానికి వచ్చేద్దామనుకుంటుంటే ఈ జానకితో పరిచయం అవటమేమిటి, పెళ్ళయి పోవటమేమిటి - అంతా చిత్రంగా కథలో చెప్పినట్టు జరిగిపోయిందనుకో! జానకి అసలు పేరు - అదే, అమెరికాలో ఆమె పేరు "నోరా." పెళ్ళి అవుతూనే పేరు మార్చేసుకుంది. భారతదేశం ఎప్పుడు వెళ్ళిపోదామా అనే తహతహే పెళ్ళి అయిననాటి నుంచీ -"

"ఏఁవిటో - ఇక్కడికొచ్చి - మనం చదువుకున్న చదువుని ఇక్కడి ప్రజల కందించి సార్థకం చేసుకోవాలని ఒకటే తాపత్రయం - ఒకటే ఆరాటం - ఏవేవో ఆలోచనలు, తనకి!"

"మంచి ఆస్పత్రి పెట్టాలనీ, అడవుల్లో, కొండల్లో ఉండే వాళ్ళకి చదువూ సంధ్యా నేర్పాలనీ, ముసలి వాళ్ళని చేరదీసి ఏదో అండాదండా కల్పించాలనీ తన అభిలాష-"


**తారకం మెట్ల మీద నుంచుని చెయ్యి ఊపుతూ, సాగిపోతున్న లాంచీకి వీడ్కోలు చెబుతున్నాడు. అలల్ని చీల్చుకుంటూ లాంచీ చూపుమేర దాటి ఒక కూత కూసింది.**

"అక్కడ ప్రతివాడూ ఏదో ఒక పని చేయాల్సిందేననీ, అక్కడందరూ కలిసి తినాలనీ, కలిసే బతకాలనీ, ఎవరూ ఎవరికీ యజమాని కారనీ - ఇలాగ ఏవేవో ఊహాలు-" రామరాజు చెబుతుంటే తారకం పక్కున పగలబడి నవ్వేశాడు.

"ఏం! మా ఆలోచన బాగాలేదా అంతలా నవ్వుతున్నావ్" అంటూ రామరాజు తెల్లబోయాడు.

"ప్లాన్ బాగానే ఉందికానీ, అమలుపరచడం సాధ్యమా అని!" నవ్వుతూనే అన్నాడు తారకం.

"చూద్దాం" అని ఏదో చెప్పబోతున్న రామరాజు మాటకు, స్నానం పూర్తి చేసుకొచ్చిన జానకి అడ్డుపడి "ఏమిటి! మరిదిగారు అంతలా నవ్వేసుకుంటూన్నా"రని అడగటంతో తారకం టక్కున మీట నొక్కినట్టు నవ్వు ఆపేశాడు.



"ఏముంది! మన పర్ణశాల గురించి చెబుతున్నాను-" అని పూర్తిచేశాడు రామరాజు.

"ఔను! ఆ పాపికొండలూ, దండకారణ్యం, ఆ కొండల మధ్యా అడవుల మధ్యా గోదావరీ; అమాయకులైన గిరిజనులూ - నేషనల్ జాగ్రఫిక్‌లో చూస్తేనే అంత బావున్నాయి! మీరూ రాకూడదా! చాలా హాయిగా ఉంటుంది" అంటున్న జానకి మాట కట్టొచ్చి -

"అన్నట్లు తారకం! రేపు ఉదయం ఏడింటికల్లా ఒక స్టీం లాంచీ ఏర్పాటు చేసుకోవాలి - అలా రేవు వరకూ పోయొద్దామా" అన్నాడు రామరాజు.

"అక్కర్లేదు. అంతా ఏర్పాటయి పోతుంది" అని తారకం ఫోన్ ఎత్తి ఎవరితోనో మాట్లాడుతుంటే జానకి "మీరు కూడా స్నానాలు పూర్తిచేసుకుంటే హాయిగా కూర్చుని మాట్లాడుకోవచ్చుగా" అంది.

"ఇదుగో! ఒక్క క్షణం" అని రామరాజు స్నానాల గదివైపుకి నిష్క్రమించాడు.

*ఉప్పొంగిపోయింది గోదావరీ, తాను*
*తెప్పున్న ఎగసింది గోదావరీ -*
*వడులతో నుడులతో గర్వాల నడలతో"*

తనలో తాను పాడుకుంటున్న పాటని తారకాన్ని చూసి ఆపి, "మీరు కూడా స్నానం చేసిరండి" అంది జానకి.

అలాగేనంటూ తారకం పక్కగదిలో ఉన్న అల్మరా దగ్గరికి పోయి దాంట్లో నుంచి ఒక సీసా తీసి కాస్త మద్యం ఒంపుకుని నాలుగైదు ఐస్ ముక్కలు వేసుకొని కొంచెం చప్పరించి గ్లాస్ అక్కడే పెట్టి ఇవతలకి వచ్చాడు మూతి సుతారంగా రుమాలుతో అద్దుకుంటూ.

"మీకు కోపం రాదంటే ఒక్క మాట!" అన్నది జానకి.

తారకం ఎందుకో ఒక్కసారి ఉలిక్కిపడి, వెంటనే సంబాళించుకొన్నాడు, ఏమి చెబుతుందో ఏవిటో! తాను అలా గదిలోకి పోయి కాస్త చప్పరించి రావడం గురించి ఉపన్యాసంగాని ఇస్తుందో ఏమో అనుకుంటూ. "అమెరికాలో మేము ఉండే మేడకంటేనూ, ఇక్కడ మీరు నిర్మించుకొన్న మహలు కంటేనూ గోదావరి మాత్రం చాలా గొప్పగా, హాయిగా, అందంగా ఉన్నదండీ" అన్న జానకి మాటతో తారకం స్తిమితపడ్డాడు "ఓస్ ఇంతేనా" అనుకొన్నట్టు.

"మీరు నిజంగా అదృష్టవంతులండీ! ఎంత పుణ్యం చేసుకుని ఇక్కడ పుట్టారో! ఈ దేశంలోని గొప్ప గొప్ప నదీ తీరాల్ని చూస్తే నా కెంత సంతోషంగా ఉందనుకున్నారు-

దారి పొడుగునా ఉత్సవాలు; పెళ్ళిళ్ళు, పేరంటాలు - సంబరాలే. అబ్బ! నా చిన్నప్పట్నుంచీ నా కలల్లో చూసినవన్నీ ఇక్కడికి వచ్చి ప్రత్యక్షంగా చూశాననుకోండి. అక్కడ అమెరికాలోనే ఉంటే నా బతుకు కలగానే మిగిలిపోయేదనుకోండి -

కలలు నిజం కావటమంటే ఇదే కాబోలు. ఈ దేశం వచ్చి తీర్థయాత్రల్లో చూస్తుంటే నాకలా అనిపించింది. చూడండీ! గోదావరీ మహా కూలంకషామృత శ్రీ దివ్య మృదు తరంగాలు - ఈ పుణ్యభూమినీ, ఆర్ష సంస్కృతినీ, హిమాలయాల్నీ వదిలిపెట్టి భారతీయు లెందుకు విదేశాలకి ఎగబడతారో నాకు చచ్చినా అర్థం కాదండీ" అంటుంటే రామరాజు స్నానాదికం ముగించుకొని వాళ్ళు కూర్చున్న హాల్లోకి వస్తూనే "ఏవిఁటీ! మా వాడి బుర్ర ఇంకా చెడిపోకుండా ఉందా" అన్నాడు.

"నేను చెడగొడుతున్నానా! ఇంకా నయం."

రవీంద్రుడు ఏమన్నాడో తెలుసా! భారత సంస్కృతి ఆరణ్యకం. అంటే అరణ్యాల్లో, మున్యాశ్రమాల్లో పుట్టి, రాజప్రాసాదాల్లో పెరిగి పరిఢవిల్లింది - మిగిలిన దేశాల సంస్కృతి రాజప్రాసాదాల్లోనే పుట్టింది - అక్కడే యుద్ధాలు చేస్తోంది.

"ఈ భూమ్మీద పుట్టిన వాళ్ళని నేను చెడగొట్టడం ఏమిటి? ఎవరన్నా వింటే నవ్విపోతారు చాల్లెండి" అన్నది జానకి.

"తారకం! నువ్వెళ్ళి ముందు స్నానం చేసిరా, తరువాత మాట్లాడుకోవచ్చు" అంటూ రామరాజు తారకం భుజం మీద చేయి వేసి స్నానాల గది వరకూ తీసుకెళ్ళి దిగవిడచి తిరిగొచ్చి, "జానకీ! ఏమిటి నీ పిచ్చి? నీ దృష్టిలో భారతదేశం చాలా గొప్పదే కావచ్చు కానీ, దరిద్రమంతా భారతదేశంలోనే పుట్టిందని తారకం అభిప్రాయం. నువ్వట్లా మాట్లాడితే వాడు చాలా బాధపడతాడు. ఎందుకు చెప్పు వాణ్ణి అనవసరంగా బాధపెట్టడం" అన్నాడు.

"అయ్యో! నాకా సంగతి తెలియదండీ! ఇహ మాట్లాడనులెండి" అన్నది జానకి తన అమాయకత్వానికి తానే నొచ్చుకొంటూ.

* * *

ఇంకా తెల్లగా తెల్లారకముందే తారకం ఏర్పాటుచేసిన లాంచీ అతను సిద్ధంగా ఉన్నట్టు జాన్ వచ్చి "సర్! లాంచీ రెడీ" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"అసలు నేను ముందే ఇక్కడ్నుంచి పాపికొండలకి స్టీమ్ లాంచీ ఏర్పాటు చేసుకొని మరీ బయల్దేరాను అమెరికాలో - పోన్లే! ఇచ్చిన అడ్వాన్స్ పోయేది - నువ్వు కుదిర్చిన లాంచీలోనే వెడదాం! ఏం జానకీ!" అన్నాడు రామరాజు.

"అలాగే బాగుంటుంది - మన ప్రయాణంలో మరిదిగారు కూడా పాలుపంచుకొని సాగనంపినట్టుగా ఉంటుంది" అని చిన్న నవ్వు పెదవుల మీద ఎంతో ఆదరంగా చిందిస్తూ అంది జానకి.

"అయితే, ఆలస్యం దేనికి. బయలుదేరుదాం! చీకటి పడకుండా పేరంటపల్లి చేరుకోవచ్చు. ఏటి కెదురు ప్రయాణం గదా! పైగా అక్కడ మనవాళ్ళంతా మనం వస్తామని ఎదురు చూస్తుంటారు కూడా" అంటూనే రామరాజు బ్రీఫ్‌కేస్ చేతబట్టుకున్నాడు. జానకి మరో బ్రీఫ్‌కేస్ పట్టుకుంది.

"జాన్ విల్ బ్రింగ్ ఆల్ ద లగేజ్, లీవ్ ఇట్ హియర్! వియ్ విల్ జస్ట్ వాక్ డౌన్" అన్నాడు తారకం.

ముగ్గురూ మెట్లదారిని లాంచీ దగ్గరకు బయల్దేరారు. జానకి మాత్రం మెట్ల మీద చెంగు చెంగున గెంతుతూ హుషారుగా పరుగెత్తుతోంది. తారకం, రామరాజు, కబుర్లు చెప్పుకుంటూ తాపీగా దిగివస్తున్నారు.

"కాస్త తీరిక చేసుకుని నువు కూడా ఒకసారి మా ఆశ్రమానికి రాకూడదూ సరదాగా... అక్కడ ఇంజనీర్స్‌కీ పనుంటుంది. నీకు నచ్చితే, ఇష్టమైతే అక్కడే అంతా కలిసి ఉండచ్చు; అయితే ఒకటి - అక్కడ ఆశ్రమంలో తాక్కోడదు - పని చేయాలి -" అన్నాడు రామరాజు.

తారకం తేలిగ్గా నవ్వేశాడు "గుడ్ జోక్" అంటూ.

జానకి లాంచీ దగ్గిర పది నిమిషాలు ఎదురుచూస్తూ నిల్చుంది మిత్రుల పెళ్ళి నడకల్ని.

"ఆల్‌రైట్! ప్లీజ్ గెటిన్" అన్నాడు తారకం.

ముందు జానకి "వెళ్ళొస్తాం మరిదిగారూ!" అని లాంచీ ఎక్కి కూర్చుంది.

రామరాజు ఆప్యాయంగా తారకాన్ని గాఢంగా కౌగిలించుకొని - నీరు చిమ్ముతున్న కళ్ళు ఒత్తుకుంటూ లాంచీ ఎక్కాడు. తారకం మెట్లమీద నుంచుని చెయ్యి ఊపుతూ, సాగిపోతున్న లాంచీకి వీడ్కోలు చెబుతున్నాడు. అలల్ని చీల్చుకుంటూ లాంచీ చూపు మేర దాటి ఒక కూత కూసింది. లక్ష్మణస్వామి లేని సీతారాముల్లా అమెరికా నుంచి వచ్చిన కలల పంట భద్రాచలం వైపుకు సాగి క్రమక్రమంగా కనుమరుగైపోయింది.

తారకం తన రాజమహల్‌కి మెట్లదారి నొక్కొక్క మెట్టే ఎక్కుతూ 'ఇహ ఈ దేశాన్ని ఎవడూ ఉద్ధరించలేడు' అనుకున్నాడు. ■